రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త






# మున్సిపోల్ ఫీవర్

**అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్ - ఓటరు తీర్పుపై ఉత్కంఠ**
**బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం - 16న చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక**
**ఆధిపత్యమే లక్ష్యంగా వ్యూహాలు - క్యాంపు రాజకీయాలకు సన్నాహాలు**

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం జరుగనున్నందున వారిలో టెన్షన్.టెన్షన్.ఉత్కంఠత కొనసాగుతుంది. వారి భవితవ్యం అంతా బ్యాలెట్ బాక్సులో ఉండటంతో కౌంటింగ్ కోసం ఉత్కంఠతగా ఎదురుచూస్తూ ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నంలోపే వార్డుల వారీగ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులతో పాటు మరి కొందరు ఇండిపెండెంట్లు కూడ గెలుస్తామన్న ధీమాలో ఉండి ఎదురుచూస్తున్నారు. మెజార్టీ స్థానాలు సాధించిన వారు క్యాంపులకు తరలివెళ్లె అవకాశం ఉందని చెప్పవచ్చు. మెజార్టీ తగ్గితే ఇండిపెండెంట్లు గెలిస్తే వారికి గాలం వేసే అవకాశం కూడ లేకపోలేదని పలువురు భావిస్తున్నారు. ఈ నెల 16వ తేదీన ఆయా మున్సిపాల్టీలకు చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక జరుగనుంది. 13న జరిగే ఓట్ల లెక్కింపు ఫలితాలు వెలువడిన వెంటనే గెలిచిన వారిని క్యాంపులకు తరలించేందుకు ఆయా పార్టీల వారు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలుస్తుంది. చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులను కైవసం చేసుకోవటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ వర్గాల నుంచి సమాచారం. అయితే అలియాబాద్ చైర్మన్ పదవి (జనరల్-మహిళ), మూడుచింతలపల్లి చైర్మన్ పదవి (ఎస్సీ-జనరల్), ఎల్లంపేట్ మున్సిపల్ చైర్మన్ పదవి (ఎస్టీ-మహిళ) రిజర్వేషన్లు ఉన్న సంగతి తెలిసిందే. ఎన్నికల కౌంటింగ్ పూర్తి తరువాత మున్సిపాల్టీల చైర్మన్,వైస్‌చైర్మన్ ఎన్నికలపై ఇక అందరి దృష్టి పడనుంది. గెలిచిన అభ్యర్థులతో చైర్మన్,వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం క్యాంపు రాజకీయాలు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ప్రత్యేక దృష్టిని సారించినట్లు, కొన్ని చోట్ల బిజెపి అభ్యర్థులు గెలిస్తే మాత్రం వారు కీలకం కూడ కానున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా గెలుపు గుర్రాలతో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం క్యాంపు రాజకీయాలు కొనసాగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# నేడు ఓట్ల లెక్కింపు

## ఉదయం 8గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం

**5వార్డులకు ఒకరౌండ్ చొప్పున మూడు రౌండ్‌లలో లెక్కింపు**
**పకడ్బందీగా ఏర్పాట్లు - గట్టి పోలీసు భద్రత - మేడ్చల్ జిల్లాలో మూడు చోట్ల కౌంటింగ్**

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీల్లో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కౌంటింగ్ కేంద్రాల్లో శుక్రవారం ఉదయం 8గంటలకు ప్రారంభం కానుంది. అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాల్టీల పరిధిల్లో ఏర్పాటు చేసిన మూడు చోట్ల ఓట్ల లెక్కింపును చేపట్టటానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్దం చేసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అలియాబాద్ మున్సిపాల్టీకి సంబంధించి ఓట్ల లెక్కింపు సెంటర్‌ను ఆ మున్సిపాల్టీ పరిదిలోని మజీద్‌పూర్‌లోని శ్రీటి.చైతన్య హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. అదే విధంగ మూడుచింతలపల్లి మున్సిపాల్టీకి సంబంధించి ఓట్ల లెక్కింపు సెంటర్‌ను ఆ మున్సిపాల్టీ పరిధిలోని జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎల్లంపేట్ మున్సిపాల్టీకి సంబంధించి డబిల్‌పూర్‌లోని భారత్ బైబిల్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే మున్సిపాల్టీల్లో ఓట్ల లెక్కింపు కోసం 14టేబుల్స్‌ను ఏర్పాటు చేసి రెండు రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేయనున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. ఒక్కొక్క టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లతో కలిపి మొత్తం 153మంది సిబ్బందితో ఆయా మున్సిపాల్టీలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లలో ఓట్ల లెక్కింపును ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిగ మొత్తం సిసి కెమెరాల పర్యవేక్షణలో గట్టి పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రజల ప్రశాంతతకు ఎలాంటి భంగం వాటిల్లకుండ, ముందస్తు భద్రతలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ ఉండటానికి లెక్కింపు కేంద్రాల పరిసర ప్రాంతాలలో 500రేడియస్ లోపల ఐదుగురికి మించి గుమగూడకూడరాదని, మిగతా 2లో



ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటును పరిశీలిస్తున్న పరిశీలకురాలు నిర్మల కాంతి వెస్లీ, కలెక్టర్ మనుచౌదరి

# నిషేధాజ్ఞలు పాటించాలి



సిపి సుధీర్ బాబు

**శాంతి భద్రతల పరిరక్షణకు సెక్షన్ 163 అమలు**
**- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు**

**రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూడాలనే ఉద్దేశంతో భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నిషేధాజ్ఞలు ఓట్ల లెక్కింపు జరుగనున్న కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అమలులో ఉంటాయని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించిన గుంపులు కూడరాదని స్పష్టంగా ఆదేశించారు. అలాగే ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు నిర్వహించకూడదని సూచించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆమనగల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, శంకర్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీ ప్రాంతాల్లో ఈ ఆదేశాలు కఠినంగా అమలులో ఉంటాయని కమిషనర్ తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మిగతా 2లో

# కూడికలు..తీసివేతలు

**మున్సిపల్ ఫలితాలపై తర్జన భర్జన**
**షాద్‌నగర్‌లో ఎక్కడ చూసినా ఇదే చర్చ**
**కౌంటింగ్‌కు మినీ స్టేడియంలో ఏర్పాట్లు**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** కౌన్సిలర్‌గా ఎవరు వస్తారో.. చైర్మన్ స్థానాన్ని ఏ పార్టీ అందుకుంటుందో.. చైర్మన్‌గా తెరమీదికి వచ్చేది ఎవరో.. ఓటరన్న తీర్పు ఎవరివైపో.. ఎన్నికల లెక్కింపుకు ఒక్కరోజు గ్యాప్ రావడంతో ప్రతివార్డులో ఇదే చర్చ జరుగుతుంది. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కూడా తుది ఫలితాల కోసం ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నాయి. ఇటు కాంగ్రెస్ అటు బిఆర్ఎస్ క్యాడర్ అంతా గురువారం అంతా పోలింగ్ సరళిపై కూడికలు తీసివేతలతో గెలుపు అవకాశాలపై చర్చల్లో మునిగిపోయారు.

బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఎవరికి వారు సైలెంట్‌గా తమ ఓటు వేసి వచ్చారు. పది రోజులపాటు అటు కాంగ్రెస్ పార్టీ, ఇటు బిఆర్ఎస్‌లు చైర్మన్ స్థానం కోసం పోటాపోటీగా రంగంలోకి దిగాయి. కాంగ్రెస్ విషయానికి వస్తే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రతి వార్డును తన భుజం మీద వేసుకొని అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశారు. దాదాపు ప్రతివార్డులోనూ తిరిగి ఇంటింటి ప్రచారం ద్వారా తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇక బీఆర్ఎస్ లో అగ్రనేతల ప్రచార ఆర్భాటం పెద్దగా లేకపోయినప్పటికీ అభ్యర్థులు ఎవరికి వారుగా సైలెంట్ గా తమ పని తాము చేసుకుంటూ వెళ్ళిపోయారు. ఇక ఎన్నికలకు చివరి రెండు రోజులు అన్ని పార్టీలు ప్రలోభాలతో ఓటర్లకు ఎరవేసే ప్రయత్నం చేశాయి. ఇక ఎన్నికల రోజున అంటే బుధవారం ఉదయం నుంచి ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు ఎక్కడ బయటపడకుండా తమ పని తాను చేసుకుంటూ పోయారు. సాయంత్రం ఐదు గంటలకల్లా తమ తీర్పును బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. ఈ మధ్యలో ఒక రోజు గ్యాప్ రావడంతో ఓటర్ల నాడు ఏమిటో అర్థం చేసుకోలేక అటు నేతలు, కార్యకర్తలు, అభ్యర్థులు, చివరికి వార్డుల వారీగా ప్రజల సైతం ఉత్కంఠకు గురవుతున్నారు. ఎవరికి వారుగా ఫలితం తమవైపే ఉంటుందని నమ్ముతున్నారు. ప్రస్తుతం వార్డుల వారిగా ప్రజలు, పార్టీల వారీగా నాయకులు, కార్యకర్తలు అన్నింటికీ మించి అభ్యర్థులు ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. రేపు ఎప్పుడు అవుతుంది అన్నంత ఉద్వేగంగా మరుసటి రోజు కోసం ఎదురుచూస్తున్నారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయ్యే ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి పట్టణంలోని మినీ స్టేడియంలో అన్ని మిగతా 2లో



షాద్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిసిపి శిరీష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# 34 వార్డ్‌లకు.. 12 టేబుళ్లు

**కౌంటింగ్ సెంటర్లలో విద్యుత్ బ్యాకప్ ఉండాలి**
**-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్**

**వికారాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ను పారదర్శకంగా, శాంతియుతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం వికారాబాద్ పట్టణం లోని ఎస్ఏపీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ ఏర్పాట్ల ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని, కౌంటింగ్ కేంద్ర పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. అనుమతి ఉన్న సిబ్బంది, అభ్యర్థుల ఏజెంట్లకే ప్రవేశం ఉంటుందని, 34 వార్డ్‌లకు, 12 టేబుల్స్, ఒక సూపరింటెండెట్, ఇద్దరు అసిస్టెంట్‌లు ఉంటారని తెలిపారు. ఒక టేబుల్ కు ముగ్గురు చొప్పున ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. కౌంటింగ్ హాలు లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేయాలనీ, ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్ అ నుమతి లేదని అధికారులకు ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమై, నిర్ణీత కాలంలో దశలవారీగా కొనసాగుతుందని తెలిపారు.

**మూడో అంతస్తు నుంచి దూకి**

# విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ యంనంపేట్ శ్రీ నిధి ఇంజినీరింగ్ కళాశాలలో ఫస్టియర్ విద్యార్థి ఒకరు కళాశాల మూడో అంతస్తు భవనంపై నుండి కిందికి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ హంటర్ రోడ్డు కాలనీకి చెందిన జి. కల్యాణ్ యంనంపేట్ శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల ఇంజినీరింగ్ ఎఐ ఫస్టీయర్ చదువుతున్నాడు. యంనంపేట్ గ్రామంలోని నిత్యశ్రీ హాస్టల్‌లో నివాసం ఉంటూ ఇంజినీరింగ్ చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. కళాశాలలో కల్యాణ్ ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో సదరు విద్యార్థి తల్లితండ్రులకు కళాశాల ప్రిన్సిపాల్ సమాచారం ఇవ్వగా విద్యార్థి తల్లి బంధువులతో కలిసి కళాశాలకు వచ్చి విద్యార్థి సమక్షంలోనే ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతోంది. ఇదే సమయంలో బాధిత విద్యార్థి కల్యాణ్ వాష్‌రూంకు వెళ్లివస్తానని చెప్పి కళాశాల మూడో అంతస్తు పైకి వెళ్లి కిందకు దూకాడు. దీంతో తీవ్రగాయాలు కాగా కళాశాల సిబ్బంది బాధిత కుటుంబ సభ్యులతో కలిసి జోడిమెట్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. విద్యార్థి పక్కటెముకలు, కాళ్లు పలుచోట్ల విరిగినట్లు పోలీసులు తెలిపారు. మెరుగైన చికిత్స కొరకు బాధితుడ్ని నగరంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ సీఐ రాజు వర్మ తెలిపారు.

**శామీర్‌పేటలో వెల్లువెత్తిన**

# కార్మిక సంఘాల నిరసన

**ట్రంప్..మోడీల దిష్టిబొమ్మలు దగ్ధం**

**శామీర్‌పేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** దేశ కార్మిక, రైతాంగ, పేద, మధ్య తరగతి ప్రజలకు వ్యతిరేకంగా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ లక్షణాలు కల్గిన అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ నాయకత్వాన్ని భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సమర్థించటాన్ని విమర్శిస్తూ సిపిఐ,సిపిఎం నాయకులు దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ఇస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. డోనాల్డ్ ట్రంపు, నరేంద్రమోదీల దిష్టిబొమ్మలను వారు దగ్గం చేశారు. గురువారం శామీర్‌పేట రాజీవ్‌రహదారి వైఎస్ఆర్ చౌరస్తా నుంచి నల్సార్ చౌరస్తా వరకు సిపిఐ, సిపిఎం నాయకులు ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసనలు తెలుపుతూ వారి దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. అమెరికాతో స్వేచ్ఛ వాణిజ్య, వ్యాపార ఒప్పందాలను వ్యతిరేకిస్తూ, భారత దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యున్నత భాగం కార్మిక, రైతాంగం,అలాంటి నాయకత్వాలను సంప్రదించకుండ వారితో చర్యలు జరపకుండ, అభిప్రాయ సేకరణ చేయకుండానే ప్రజా ఆమోదం లేని విధి విధానాలను చట్టరూపంలో తీసుకరావాలని ఆలోచనతో నరేంద్రమోదీ ప్రభుత్వం వ్యవరిస్తుందని దీన్ని హెచ్చరిస్తూ జాతీయ స్థాయి కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం) ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనటం జరిగిందన్నారు. దీనికి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. దీనిలో రాష్ట్ర సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు డిజి సాయిలుగౌడ్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ ధశరథలు పాల్గొన్నారు. అదే విధంగ వారితో పాటు జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహ్మా, జిల్లా అధ్యక్షులు జంగయ్య, గౌరవాధ్యక్షులు వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి సోగడ రమేశ్, సిపిఐ సీనియర్ నాయకులు గొలుసుల మల్లయ్య, మిగతా 2లో



బంట్వారం-తొర్మామిడి రోడ్డులో తారు వేయకపోవడంతో ద్విచక్ర వాహనాల పాట్లు..

# కంకరతో సరి..

**బంట్వారం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఆ దారి గుండా వెళ్ళాలంటే వాహనదారులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిందే. బంట్వారం మండల కేంద్రం నుంచి తొర్మామిడి వెళ్ళే రోడ్డు అధ్వాన్న పరిస్థితి కారణంగా తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బంట్వారం-తొర్మామిడి రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. గత పదేళ్ళ నుంచి ఈ మార్గం పూర్తిగా గుంతల మయంగా మారింది. కాంగ్రెస్

**మిగతా పనులు ఎప్పుడు మరి?**
**అధ్వానంగా బంట్వారం-తొర్మామిడి రోడ్డు..**
**ద్విచక్ర వాహనాలకు దినదిన గండం**
**తరచు ప్రమాదాలు**
**కాగితాలకే పరిమితమవుతున్న నిధుల మంజూరు**

ప్రభుత్వం వచ్చాక రోడ్డు తవ్వేసి కంకర వేశారు. ఆ తర్వాత పనులు పూర్తికాకపోవడంతో కార్లు, ఇతర పెద్ద వాహనాలు నెమ్మదిగా ప్రయాణించినా..ద్విచక్ర వాహనచోదకులు నరకాన్ని చవిచూస్తున్నారు. కంకర వేసిన రోడ్డు పై తరచూ ప్రయాణించి రోడ్డుపై జారీ పడటంతో పలువురు గాయాలపాలవుతున్నారు. చిన్న దరి, పెద్ద దరిగా పిలువబడే ఘాట్ రోడ్డులో మరింత ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మలుపుల వద్ద రోడ్డు వెడల్పుగా లేని కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు తరుచు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు మార్గం ధ్వంసమైనప్పటికీ బాగు చేసిన దాఖలాలు లేవు. ఇప్పుడైనా బాగు చేస్తారనుకుంటే దొందు..దొందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. బంట్వారం మండలం యాచారం చౌరస్తా నుంచి తొర్మామిడి వరకు డబుల్ లైన్ల రోడ్డు వేస్తామంటూ కాంగ్రెస్ నాయకులు పలు సమావేశాల్లో ప్రగల్భాలు పలుకుతున్నా.. అవి కార్యరూపంలోకి రావడం పగటి కలేనని వాపోతున్నారు. ఈ సమస్యలపై స్థానిక నాయకులు వెళ్లి అధినాయకులకు విజ్ఞప్తిచేసినా.. కేవలం మంజూరు పత్రాలు చూపించి మభ్య పెడుతున్నట్లు తెలుస్తోంది.
ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి యాచారం చౌరస్తా నుంచి తొర్మామిడి వరకు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని, చిన్న దరి, పెద్ద దరి వద్ద రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని పలువురు మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రమాధభరింతంగా చిన్నదరి ఘాట్ రోడ్డు

# మహేశ్వరంలో విగ్రహావేశాలు!

**అర్ధరాత్రి శివాజీ విగ్రహం ఏర్పాటుకు బిజెపి నేతల ప్రయత్నం**

**స్థానికులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత**
**పోలీసుల జోక్యంతో విగ్రహం తొలగింపు**

**మహేశ్వరం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మహేశ్వరం మండల కేంద్రంలో బిజెపి నాయకులు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం వివాదాస్పదమైంది. ఏ విధమైన అనుమతులు తీసుకోకుండా బుధవారం అర్ధరాత్రి విగ్రహాన్ని ట్రాక్టర్లో తీసుకొచ్చి క్రైన్ సహాయంతో ఏర్పాటు చేయటానికి సన్నాహాలు చేశారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బిజెపి నాయకులను అడ్డగించారు. అర్ధరాత్రి లైట్లు, సీసీ కెమెరాలు బంద్ చేసి అనుమతులు లేకుండా విగ్రహం పెట్టడం సరికాదని సీఐ వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. శివాజీ విగ్రహాన్ని అంబేద్కర్ విగ్రహం పక్కన పెడితే తప్పేంటని, కావాలని కొందరు రాజకీయ లబ్దిపొందేందుకు కుట్రలు చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న మహేశ్వరాన్ని, శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న తరుణంలో గ్రామస్తుల మధ్య చిచ్చు పెట్టడం బీజేజీ నాయకులకు తగదని స్థానికులు వాగ్వాదానికి దిగారు.. దీంతో దళిత సంఘాలు, బీజేపీ నాయకులు, ఆర్ఎస్ఎస్ నాయకులు భారీ ఎత్తున అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. జైభీమ్, జైభవానీ వీరా శివాజీ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ అందోళనలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలకు సర్దిచెప్పారు. అంబేద్కర్, జగ్జీవన్రామ్ విగ్రహాల పక్కన ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని తొలగించి గ్రామ పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ప్రస్తుతం మహేశ్వరంలో శివగంగ రాజరాజేశ్వర మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో ఉత్సవాలు ముగిశాక 20వ తేది గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గం, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఇరు పార్టీలనేతలతో మాట్లాడి ఒక చోట స్థలాన్ని ఎంచుకొని అక్కడ శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మహేశ్వరంలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు తలేత్తకుండా మహేశ్వరం జోన్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీలు జానకిరెడ్డి, రాజు, సీఐలు వెంకటేశ్వర్లు, పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి లైట్లు, సీసీ కెమోరాలు బంద్ చేసి అంబేద్కర్ విగ్రహం వద్ద శివాజీ విగ్రహం ఏర్పాటు చేసిన వారిని గుర్తించి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, ప్రశాంతంగా ఉన్న మహేశ్వరాన్ని యువకుల్లో విద్వేశాలు రెచ్చగొట్టిన వారి పట్ల ఉపేక్షించేది లేదని కారకులపై చర్యలు తీసుకుంటామని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.రాజ్యంగ నిర్మాత బీఆర్. అంబేద్కర్, జగ్జీవన్రామ్ విగ్రహాల పక్కన అనుమతులు లేకుండా అర్ధరాత్రి విగ్రహం పెట్టడం సరియైంది కాదని దళిత సంఘాలు, అంబేద్కర్ వాదులు, గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని మిగతా 2లో

## ఘట్‌కేసర్‌లో తల్లీకూతుళ్ల అదృశ్యం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** భర్త సెల్‌ఫోన్ కొనివ్వడం లేదని ఓవివాహిత తన కుమార్తెను తీసుకొని ఇంటికి వెళ్లిపోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ డివిజన్ లింగాలకుంటలో ఉంటున్న వేముల సురేశ్ భార్య వేముల సోనీ (24), కూతురు భవ్యశ్రీ (3)లు బుధవారం ఉదయం 7 గంటలకు ఎవరికి చెప్ప కుండా ఇంటి నుండి వెళ్లి పోయారు. భర్త సురేశ్ తనకు మొబైల్‌ఫోన్ కొనివ్వడంలేదని గత కొన్ని రోజులుగా నిర్లక్ష్యం చేస్తున్నాడనే కారణంతో సోనీ తన కూతురు భవ్యశ్రీని వెంట తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోగా సాయంత్రం వరకు సురేశ్ అంతటా వెతికినా ఆచూకి లభించకపోవడంతో గురువారం సాయం త్రం 5 గంటలకు ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తల్లికూతుళ్ల మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభా కర్‌రెడ్డి తెలిపారు.


తల్లికూతుళ్లు సోనీ, భవ్యశ్రీ

## నేడు ఓట్ల లెక్కింపు

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలు అతిక్రమించినట్లైతే చట్ట రీత్య చర్యలు తీసుకోవటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి హెచ్చరించారు. అయితే అలియాబాద్ మున్సిపాల్టీల్లో మాత్రం 20వార్డులకు సంబంధించి ఓట్ల లెక్కింపు మొదటి రౌండ్‌లో 7వార్డులు, రెండవ రౌండ్‌లో 7వార్డులు, మూడవ రౌండ్‌లో 6వార్డులకు ఓట్ల లెక్కింపును నిర్వహించనున్నారు. అదే విధంగ మూడుచింతలపల్లి (24వార్డులు) ఎల్లంపేట్ (24వార్డులు) మున్సిపాల్టీల్లో మాత్రం మొదటి రౌండ్‌లో 12వార్డులు, రెండవ రౌండ్‌లో మరో 12వార్డులకు ఓట్ల లెక్కింపు నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు. అయితే కౌంటింగ్ సెంటర్ల లోపలికి మొబైల్ ఫోన్లు అనుమతించటం జరగదన్నారు.

## నిషేధాజ్ఞలు పాటించాలి

(మొదటి పేజీ తరువాయి)

పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అందరూ ఎన్నికల నిబంధనలు పాటించి పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కమిషనర్ జి. సుధీర్ బాబు విజ్ఞప్తి చేశారు. శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే అరెస్టులు కూడా జరుగుతాయని హెచ్చరించారు. ప్రజల సహకారంతోనే ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయగలమని ఆయన పేర్కొన్నారు.

**లెక్కింపు ఇలా..**

జిల్లాలోని ఆరు మునిసిపాలిటీలలో ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం నియమించిన సిబ్బంది వివరాల లెక్కింపును ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. ప్రతి మునిసిపాలిటీలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, రిజర్వ్ సిబ్బందిని కేటాయించినట్లు అధికారులు తెలిపారు. అమన్ గల్ మునిసిపాలిటీలో 5 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 1 రిజర్వ్ సూపర్‌వైజర్, 10 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 3 మంది రిజర్వ్ అసిస్టెంట్లను నియమించారు. చేవెళ్ల మునిసిపాలిటీలో 9 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 5 మంది రిజర్వ్ సూపర్‌వైజర్లు, 18 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 5 మంది రిజర్వ్ అసిస్టెంట్లు విధులు నిర్వహించనున్నారు.

ఇబ్రహీంపట్నం మునిసిపాలిటీలో 12 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 4 మంది రిజర్వ్ సూపర్‌వైజర్లు, 24 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 8 మంది రిజర్వ్ అసిస్టెంట్లను కేటాయించారు. మొయినాబాద్ మునిసిపాలిటీలో 14 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 4 మంది రిజర్వ్ సూపర్‌వైజర్లు, 28 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 8 మంది రిజర్వ్ అసిస్టెంట్లు ఉన్నారు.

షాద్‌నగర్ మునిసిపాలిటీలో 14 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 9 మంది రిజర్వ్ సూపర్‌వైజర్లు, 28 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 11 మంది రిజర్వ్ అసిస్టెంట్లు నియమించబడ్డారు. శంకర్‌పల్లి మునిసిపాలిటీలో 10 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 4 మంది రిజర్వ్ సూపర్‌వైజర్లు, 20 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 11 మంది రిజర్వ్ అసిస్టెంట్లు విధులు నిర్వహించనున్నారు.

మొత్తంగా జిల్లాలో 64 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 27 మంది రిజర్వ్ సూపర్‌వైజర్లు, 128 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 46 మంది రిజర్వ్ కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

**జిల్లావ్యాప్తంగా రాజకీయ ఉత్కంఠ**

జిల్లాలోని మున్సిపల్ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో ఉన్న ఆరు మున్సిపాలిటీల పరిధిలో 126 వార్డులకు ఇటీవల ఎన్నికలు జరగగా, వాటి ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా వస్తాయన్న దానిపై ఆసక్తి పెరిగింది. అందుతున్న సర్వేలు, రాజకీయ విశ్లేషణల ప్రకారం కొన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూల వాతావరణం ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా షాద్‌నగర్, చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశేషాలు వెల్లడిస్తున్నాయి.ఇదే సమయంలో ఇబ్రహీంపట్నం, అమన్ గల్, శంకర్‌పల్లి మున్సిపాలిటీల్లో మాత్రం భారత రాష్ట్ర సమితి అభ్యర్థులకు అనుకూలంగా ఫలితాలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని సర్వేలు చెబుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అధికార పార్టీ గట్టి పోటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు మరియు స్వతంత్రులు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొన్ని వార్డుల్లో పోటీ ఉన్నప్పటికీ, మొత్తం ఫలితాలపై గణనీయమైన ప్రభావం చూపే పరిస్థితి లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోందిమొత్తంగా చూస్తే, ప్రతి మున్సిపాలిటీలో భిన్నమైన రాజకీయ సమీకరణలు కనిపిస్తున్నాయి.సర్వేలు ఒక దిశగా సూచిస్తున్నప్పటికీ, అసలైన తీర్పు మాత్రం ఓటర్లదే కావడంతో ఫలితాలు వెలువడే వరకు ఉత్కంఠ కొనసాగనుంది.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** విద్యుత్ డిసిడబ్ల్యు పనులు, కరెంట్ తీగల కింద చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ విద్యుత్ ఏఈ బి.యశ్వంత్‌కుమార్ తెలిపారు. 11 కెవి ఎన్‌ఎఫ్‌సీనగర్ ఫీడర్ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఈ సూచించారు.

# పకడ్బందీగా ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు

**కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వరిగి ,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** పరిగి మున్సిపాలిటీలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లకు పకడ్బందీగా నిర్వహించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు.. ఓట్ల లెక్కింపును పారదర్శకంగా, శాంతియుతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం పరిగిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి అధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని , కౌంటింగ్ కేంద్ర పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అనుమతి ఉన్న సిబ్బంది, అభ్యర్థుల ఏజెంట్లకే ప్రవేశానికి అనుమతినివ్వాలని,ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సిసిటివి కెమెరాలు ఏర్పాటుచేయాలని అధికారులకు ఆదేశించారు.. ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్‌ను కేంద్రంలోనికి అనుమతి ఇవ్వరాదని తెలిపారు.


కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

తాగునీరు, వైద్య సదు పాయాలు, విద్యుత్ బ్యాకప్ వంటి మోలిక సదుపాయాలు కల్పించాలని, అభ్యర్థులు వారి ప్రతినిధులు ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

కౌంటింగ్ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ , మీడియా ద్వారా తెలియజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, ఎస్ ఐ మోహనకృష్ణ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎవరి ధీమా వారిదే ..!

**--విజయావకాశాలపై విశ్లేషణ-- నేడే తేలనున్న అభ్యర్థుల భవితవ్యం**

**-- ఫలితాలపై ఉత్కంఠత**

**తాండూరు, జనవరి 12, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికలు బుదవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి ఫలితాలపైనే పడింది. నేడు అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. మరి కొన్ని గంటల్లో ఓట్ల లెక్కింపు జరగనుంది. పోలింగ్ ముగిసినప్పటి నుంచి ఎక్కడ చూసినా మున్సిపల్ ఎన్నికల ఫలితాలపైనే చర్చలు కొనసాగుతున్నాయి. అభ్యర్థులలో మాత్రం ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ రేపుతున్నాయి. తాండూరు మున్సిపాల్టీలో 36 స్థానాలకు మెజార్టీ స్థానాలు ఏ పార్టీ కైవసం చేసుకుంటుంది, ఏ పార్టీకి మున్సిపల్ పీఠం దక్కుతుందన్న అంశం చర్చనీయాంశమైంది. తాండూరులో అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీగా పోరు కొనసాగింది. బిజెపి, ఎంఐఎం పార్టీలు మాత్రం వారి ఉనికి కోసం పోరాడారు. మెజార్టీ వార్డులలో అధికార కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చింది. దీంతో ఏ వార్డులో ఎవరు గెలుస్తారోననే ఆసక్తి రాజకీయ పార్టీలతో పాటు ప్రజల్లోనూ నెలకొంది. అయితే, రాజకీయ పార్టీల నేతలు తమ తమ పార్టీ అభ్యర్థుల విజయావకాశాలపై విశ్లేషణలు కొనసాగిస్తున్నారు. ఓటరు తీర్పు ఎవరికి అనుకూలంగా ఉంటుంది అని అంచనాలు వేసుకుంటున్నారు. వార్డుల వారిగా ఓటింగ్ సరళిపై ఆరా తీస్తున్నారు. ఏ వార్డులో ఎవరికి అనుకూలంగా ఓట్లు పడ్డాయో అని బేరీజు వేసుకోవడంలో తలమునకలవుతున్నారు. ఆయా వార్డులలో పోలింగ్ కేంద్రాల వారిగా ఓట్ల సరళిని లెక్కిస్తున్నారు. అయితే, కొన్ని వార్డులలో ఓటరు నాడీ మాత్రం ఆయా పార్టీల నాయకులు కనిపెట్టలేక పోతున్నారు. ఫలితాల వెల్లడికి ఇంకా కొన్ని గంటల వ్యవధి మాత్రమే ఉండటంతో అభ్యర్థుల్లో గుబులు మొదలైంది. విజయం ఎవరిని వరిస్తుందోనన్న భయం ఓ వైపు ఉన్నా.. గెలుపు తమదేనంటే.. తమదే అంటూ ఆయా పార్టీల నేతలు ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నారు. ఎంతో ఉత్కంఠభరితంగా సాగిన పుర పోరులో అభ్యర్థులు గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. సాధారణ ప్రజలు మాత్రం పోటా పోటీ సమరంలో గట్టెక్కేదెవరా .? అంటూ ఉత్కంఠతతో ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఏది ఏమైనా కొన్ని గంటల వ్యవధిలోనే అభ్యర్థుల భవితవ్యం బయటపడనుంది. అంత వరకు వేచి చూడాల్సిందే.

## కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు



**కొడంగల్,ఫిబ్రవరి 12ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ శుక్రవారం చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమైయ్యారు. ఇందుకు సంభందించి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.కొడంగల్ పురపాలికలో 12 వార్డులకు గాను 11,565 మంది ఓటర్లు ఉండగా 75.75 ఓటింగ్ శాతం నమోదైంది.అందులో కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల అభ్యర్దులతో పాటు సీపీఐ(ఎం),స్వతంత్ర అభ్యర్దులు పోటీ చేశారు.ఈ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల మద్యనే పోటీ రసవత్తరంగా సాగింది.కొన్ని వార్డుల్లో స్వతంత్ర అభ్యర్దులు కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలకు ధీటుగా ప్రచారం నిర్వహించారు.గురువారం పోలింగ్ ముగిసిన వెంటనే గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నా లోలోపల గుబులు రేపుతుంది.ఇదిలావుండగా కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ అభ్యర్దిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాన అనుచరుడు కాంగ్రేస్ పార్టీ 4వ వార్డు అభ్యర్ది నందారం ప్రశాంత్ పేరు ప్రధానంగా వినిపిస్తుంది.అలాగే బీఆర్ఎస్ పార్టీ నుండి చైర్మేన్ అభ్యర్దిని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఇప్పటివరకు ప్రకటించ లేదు.

## కేశంపేటలో నూతన విద్యుత్ లైన్ ప్రారంభం

**-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో తీరిన లో వోల్టేజ్ సమస్య**

**-హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు**

**కేశంపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని నిడుదవెల్లి గ్రామం 4వ వార్డులో గత కొంతకాలంగా నువ్వు ఒల్టిది సమస్యతో బాధపడుతున్న కాలనీవాసులకు కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటుతో వోల్టేజ్ సమస్య తిరనున్నాయి. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉపసర్పంచ్ సఫూరా ఆమేర్ చొరవతో ఈ పనులు పూర్తి చేయబడినట్లు తెలిపారు.గ్రామంలో గత కొంతకాలంగా నెలకొన్న లోఓల్టేజీ సమస్యకు ఈ నూతన విద్యుత్ లైన్ ద్వారా పరిష్కారం లభించిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా మెరుగుపడడంతో గృహాలు, వ్యవసాయ అవసరాలు సులభతరమయ్యాయని తెలిపారు.నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారికి, చొరవ తీసుకున్న సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉపసర్పంచ్ సఫూరా ఆమేర్‌లకు 4వ వార్డు ప్రజలు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.




ఎల్లంపేట మున్సిపాలిటీలోని డబిల్‌పూర్‌లో గల కౌంటింగ్ కేంద్రంలో

## ఎల్లంపేటలో కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

**మేడ్చల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** నేడు నిర్వహించే ఎల్లంపేట మున్సిపల్ ఓట్ల లెక్కింపుకు అధికారులు సర్వం సిద్దం చేశారు. ఈ నెల 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అద్యధికంగా ఓటింగ్ శాతం నమోదు అయ్యింది. మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో 22585 మంది ఓటర్లు ఉండగా అందులో 18805 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 83.25 శాతం నమోదయ్యింది. అందులో అత్యధికంగా 8వ వార్డులో 94.12 శాతం కాగా, 9వ వార్డులో 94 శాతం, 16వ వార్డులో 92.57 శాతం, 4వ వార్డులో 92.47 శాతం, 15వ వార్డులో 92.14 శాతం మేర నమోదు కాగా, అత్యల్పంగా 11వ వార్డులో 57.52 శాతం నమోదయ్యింది. 21వ వార్డులో 57.61 శాతం, 18వ వార్డులో 69.84శాతం, 17వ వార్డులో 70.26 శాతం, 12వ వార్డులో 72.07 శాతం ఓటింగ్ పోలయ్యింది. నేడు నిర్వహించనున్న ఈ ఓట్ల లెక్కింపును మున్సిపల్ పరిధిలోని డబిల్‌పూర్‌లో గల భారత్ బైబిల్ కళాశాలలో ఏర్పాటు కేంద్రంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 24 వార్డుల ఓట్ల లెక్కింపుకు గాను కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుల్లను ఏర్పాటు చేశారు. నేడు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న లెక్కింపు ప్రారంభం కానుందని, అందుకు ఓటింగ్ ఏజంట్లు, పోటీ చేసిన అభ్యర్థులు ఉదయం 7 గంటలకే కౌంటింగ్ కేంద్రానికి రావాలని అధికారులు తెలిపారు.

## ఆమనగల్లులో సర్వత్రా ...ఉత్కంఠ

**-బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌లో కౌంటింగ్ ఏర్పాట్లు**




**ఆమనగల్లు, జనవరి 12, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటి పాలకవర్గానికి జరిగిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం జరగనున్నది. పట్టణంలోని స్థానిక బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో అధికారులు కౌంటింగ్ ఏర్పాటు చేశారు. 15 వార్డులకు 54 మంది అభ్యర్థులు పోటి పడ్డారు. ప్రతి రౌండ్‌కు 5 వార్డుల చొప్పున మొత్తం 3 రౌండ్‌లలో లెక్కింపు చేపట్టి ఫలితాలు రాబట్టనున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను మొదలుకానున్నది. కాగా అందుకు కావలసిన అన్ని ఏర్పాట్లను అధికారులు ఒకరోజు ముందుగానే పూర్తి చేశారు. కాగా మున్సిపాలిటీలో 16984 ఓట్లకు గాను 14392 ఓట్లు పోలైనవి. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహిస్తున్నారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తే 1వ వార్డులో 847 ఓట్లకు గాను 781 ఓట్లు నమోదయ్యాయి. అలాగే 2వ వార్డులో 917కు గాను 812, 3వ వార్డులో 1394కు గాను 1215, 4 వవార్డు 1023కు గాను 1018, 5వవార్డులో 939కు గాను 827, 6వ వార్డులో 1599కు గాను 1338, 7వవార్డులో 956కు గాను 747, 8వవార్డులో 1155కు గాను 1023, 9వవార్డులో 817కు గాను 679, 10వవార్డులో 1258కు గాను 1166, 11వవార్డు 1478కు గాను 961, 12వవార్డు 1161కు గాను 989, 13వవార్డులో 1173కు గాను 920, 14వవార్డులో 1097కు గాను 953, 15వార్డులో 1070కు గాను 933 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## కూడికలు-తీసివేతలు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికల అధికారి సునీత రెడ్డి ఆధ్వర్యంలో 53 మంది సిబ్బంది ఎన్నికల కోసం పనిచేస్తుండగా, 28 వార్డుల కోసం 14 టేబుళ్ళు కేటాయించారు. ప్రతి టేబుల్ వద్ద ముగ్గురు లెక్కింపు సిబ్బందితోపాటు ఆర్వో ను ఏర్పాటు చేశారు. మరోవైపు ఎన్నికల లెక్కింపు వద్ద పూర్తిస్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డిసిపి శిరీష తెలిపారు. గురువారం ఆమె స్టేడియం వద్ద లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవో సరిత కూడా కేంద్రానికి వెళ్లి ఎన్నికల నిర్వహణ తీరు గురించి ఆరా తీశారు. మీడియా కోసం ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేస్తున్నారు. ఏడు గంటల కు ప్రారంభమయ్యే లెక్కింపు లో క్రమక్రమంగా ఒక్కో వార్డు ఫలితం బయటపడుతూ వస్తుంది. ఇక్కడ కూడా ప్రతిక్షణం ఉత్కంఠగా ఎదురుచూసే అవకాశం ఉంటుంది. ఆసక్తికరమైన ఈ ఫలితాల పరంపరకు సూర్యోదయం దాకా వేచి ఉండాల్సిందే.


షాద్ నగర్ కోట్ల లెక్కింపు కేంద్రం వద్ద అధికారుల ఏర్పాటు

## ఇండోర్ స్టేడియం వద్ద భారీ బందోబస్తు

**సమీక్షించిన డిసిపి సిహెచ్ శిరీష**

**ఎన్నికల అధికారి సునీతారెడ్డి వెల్లడి**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో రేపు చివరి అంకానికి అధికారులు తెర తీయబోతున్నారు. ఉదయం 7 గంటలకు లెక్కింపు ప్రక్రియను ప్రారంభించబో తున్నట్లు షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల అధికారిని సునీతా రెడ్డి మీడియాకు తెలిపారు. గురువారం షాద్ నగర్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును జరుపుతున్నట్టు అధికారిని సునీతా రెడ్డి తెలిపారు. మొత్తం 14 టేబుల్స్ లెక్కింపు కోసం ఏర్పాటుచేసినట్టు ఆమె తెలిపారు. ఒక్కో టేబుల్ కు ముగ్గురు లెక్కింపు సిబ్బంది ఒక ఆర్వో అధికారి ఉంటారని ఆమె పేర్కొన్నారు. మొత్తం 56 మంది సిబ్బంది ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొంటారని ఆమె తెలిపారు. లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. మీడియాకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశామని అక్కడ ఫలితాలు అందజేస్తామని వివరించారు.



షాద్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు కేంద్రం


షాద్ నగర్ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఎన్నికల అధికారితో పాటు రెవెన్యూ పోలీస్ యంత్రాంగం

**ఏర్పాట్లను సమీక్షించిన డిసిపి శిరీష**

షాద్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని స్థానిక డిసిపి సిహెచ్ శిరీష రాఘవేందర్, ఆర్డీవో సరిత, ఎసిపి లక్ష్మీనారాయణ తదితర పోలీస్ అధికారులు పరిశీలించారు. 150 మంది పోలీసు సిబ్బందితో ఎన్నికల కేంద్రం వద్ద నేడు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను ఉన్నతాధికారులతో పాటు పట్టణ సిఐ విజయ్ కుమార్ నందిగామ సిఐ ప్రసాద్ కొత్తూరు సిఐ నరసయ్య కేశంపేట సీఐ నరహరి, రూరల్ శ్రీనివాస్, ట్రాఫిక్ సి చంద్రశేఖర్ పరిశీలించారు.

## 34 వార్డ్‌లకు 12 టేబుళ్లు

(మొదటి పేజీ తరువాయి)

తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ బ్యాకప్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు వారి ప్రతినిధులు ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కౌంటింగ్ ఫలితాల ం అధికారిక వెబ్‌సైట్ ద్వారా, మీడియా ద్వారా తెలియజేయ నున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రం సింహ రెడ్డి, తహసిల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

అంబేద్కర్ విగ్రహం పక్కన శివాజీ విగ్రహం పెట్టొద్దని వెంటనే విగ్రహాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ అందోళన వ్యక్తం చేశారు.గత 40 సంవత్సరాలుగా చౌరస్తాలో అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటు చేసి అంబేద్కర్ చౌరస్తాగా నామకరణం చేశామని, అందరూ అంబేద్కర్,జగ్జీవన్‌రామ్ చౌరస్తాగా పిలుస్తారన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ను అవమానించే విధంగా బిజేజీ నాయకులు, ఆర్ఎస్ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనుమతి తీసుకొని విగ్రహం ఏర్పాటు చేస్తే అభ్యంతరం లేదని,శివాజీ అంటే మాకు గౌరవమే, అతను బహుజన వర్గానికి చెందినవారే కాబట్టి విగ్రహాన్ని గ్రామస్తులందరం తీర్మాణం చేసుకొని వేరే చోట ఏర్పాటు చేయాలని దళిత సంఘాలు, అంబేద్కర్ వాదులు డిమాండ్ చేశారు. శివాజీ విగ్రహాన్ని అంబేద్కర్ విగ్రహం పక్కన పెడితే తప్పేంటని, కావాలని కొందరు రాజకీయ లబ్దిపొందేందుకు కుట్రలు చేస్తున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

## వెల్లువెత్తిన నిరసన

(మొదటి పేజీ తరువాయి)

మహిళా సమాఖ్య నాయకురాలు పుట్టమనెమ్మ, నరసింహ్మా, ఎం.కొండయ్య, సిపిఎం,సిఐటియు నాయకులు ఎం.కిష్టప్ప, సిపిఎం మండల కన్వీనర్ గోపాల్, కమిటీ సభ్యులు ఎల్లయ్య, పలువురు కార్మిక నాయకులు, పలువురు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. ఆ తరువాత ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ, సిపిఎం నాయకులను శామీర్‌పేట పోలీసులు 26మందిని అరెస్ట్ చేసి ఆ తరువాత వదలటం జరిగినట్లు సిపిఐ నాయకులు తెలిపారు.



స్ట్రాంగ్ రూం, కౌటింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న డిసిపి నారాయణ రెడ్డి

# ఓట్ల లెక్కింపుకు 12 టేబుళ్లు ఏర్పాటు






శ్రీ ఇందు కళాశాలలో కౌంటింగ్ కోసం ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 12:** మున్సిపల్ ఎన్నికల తుధి ఘట్టం పూర్తయ్యింది, ఇక మిగిలింది ఓట్ల లెకింకంపు మాత్రమే.ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి సంబంధించిన ఓట్ల లెక్కింపునకు శేరిగూడలోని శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా మారింది. మొత్తం 24 వార్డుల ఓట్ల లెక్కింపునకు 12 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌పై రెండు వార్డులకు చెందిన ఓట్లను లెక్కించనున్నారు.ఉదయం 7 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది.కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో పోలీసులు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం 500 మీటర్ల మేర నిషేధాజ్ఞలు అమల్లో ఉంచారు. అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్‌తో పాటు ఒక కౌంటింగ్ ఏజెంట్‌కే ప్రవేశం కల్పించనున్నారు. 12 మంది సూపర్వైజర్లు, 24 మంది సహాయకులు కౌంటింగ్ విధుల్లో పాల్గొంటుండగా, అదనపు సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచారు. పోలీసు శాఖ మూడంచెల భద్రత ఏర్పాటు చేసి, కౌంటింగ్ హాల్, లోపలి గేటు, బయటి గేటు వద్ద ప్రత్యేక బందోబస్తు కల్పించింది. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక మీడియా కేంద్రం ఏర్పాటు చేశారు.మొత్తం 24 వార్డులకు 83 మంది అభ్యర్థులు పోటీ చేసిన ఈ ఎన్నికల్లో 78.45 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 25993 మంది ఓటర్లకుగాను 20392 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నిరు. ఓటు హక్కు వినియెగించుకున్ని వారిలో మహిళలే ఆధిఖ్యంగా ఉన్నారు. 9882 మంది పురుషులు, 10510 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.కాంగ్రెస్ అన్ని వార్డుల్లో అభ్యర్థులను నిలబెట్టగా, బీఆర్ఎస్ 23, బీజేపీ 20 వార్డుల్లో పోటీ చేశాయి. ఒక వార్డుతో సరిపెట్టుకుంది. ఈ ఎన్నికల్లో పలు వార్డుల్లో సతంత్ర్య అభ్యర్థులు గట్టి పోటి ఇచ్చినట్లు కనిపించింది. పలు వార్డుల్లో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొనగా, కొన్నిచోట్ల త్రిముఖ పోటీ వాతావరణం కనిపించింది. ఫలితాల కోసం అభ్యర్థులు, కార్యకర్తలతో పాటు ఇబ్రహీంపట్నం ఓటర్లు ఆతృతగా ఎదురిచూస్తున్నారు. ఈ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో స్థానిక రాజకీయాల్లో ఆసక్తి మరింత పెరిగింది.


ఆమనగల్లులో ధర్నా నిర్వహిస్తున్న పలు సంఘాల కార్మికులు
ఆమనగల్లులో కార్మికుల ఆందోళన

## ఆమనగల్లులో కార్మికుల ఆందోళన

**ఆమనగల్లు, జనవరి 12, ప్రభాతవార్త:** కార్మికుల హక్కులకు భంగం కలిగేలా కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను రూపొందిస్తుందని, కొత్త చట్టాలలోని నాలుగు లేబర్‌కోర్డు కార్మిక లోకానికి తీరని అన్యాయం గురిచేస్తుందని పలు సంఘాల నాయకులు అన్నారు. కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె పిలుపు మేరకు సిఐటియూ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం సమ్మె చేపట్టగా, స్థానిక హమాలి సంఘం, బాపూజీ తాపీమేస్త్రీ భవన నిర్మాణ కార్మిక సంఘం, ఆశవర్కర్లు, మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం, మున్సిపాలిటీ, పంచాయతీ పారిశుధ్య కార్మిక సంఘాలు, కస్తూరిభాగాంధీ విద్యాలయం సంఘాల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. పెద్దఎత్తున తరలివచ్చిన కార్మికులు బాపూజీ తాపీ మేస్త్రీ సంఘం కార్యాలయం నుండి నిరసన ర్యాలీ చేపట్టి రాజీవ్ చౌరస్తా వరకు కొనసాగించారు. అనంతరం అక్కడే బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా తాపీమేస్త్రీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి న్యాయంగా దక్కవలసిన హక్కులను కుట్రపూరితంగా కాలరాస్తుందన్నారు. కార్మికుల జీవితాలతో చెలగాటమాడే ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కోట్ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ఉద్యమం తప్పదని జహంగీర్ హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగిళ్ళ యాదయ్య, గంగిశెట్టి సురేందర్, ముక్కెరి కృష్ణయ్య, కార్మికులు మల్లేశ్, వెంకటయ్య, పర్వతాలు, సీతారాం, రత్నం, రవి, ఎల్లయ్య, నరసింహ, మస్తాన్, సయ్యద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అనురాగ్ యూనివర్శిటీ విద్యార్థికి డాక్టరేట్ ప్రధానం

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాత వార్త:** వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీ విద్యార్థి సుధమల్ల మల్లేశ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్ ప్రధానం చేసినట్లు కళాశాల ఎగ్జామ్ డీన్ ప్రొఫెసర్ ముత్తారెడ్డి గురువారం తెలిపారు. డాక్టరేట్ సాధిం చిన మల్లేశ్ డీప్ లెర్నింగ్‌ను ఉపయోగించి డీహేజింగ్ నుంచి ఉపగ్రహ చిత్రాల విజువ లైజేషన్‌ను మెరుగుపరచడం అనే అంశంపై పరిశోధన చేసినట్లు తెలిపారు. ఈ పరిశోధన డి. హరిప్రియ సమక్షంలో తీసిస్‌ను సమర్పించగా డాక్టర్ తోశన్లాల్ మీన్వాల్, అసోసియేట్ ప్రొఫె. సర్ ఎన్ఐటి రాయ్‌పూర్, అనురాగ్ యూనివర్శిటీ పరీక్షల డీన్ ముత్తారెడ్డి, ఈసీఈ విభాగపు అధిపతి హరికృష్ణ, డాక్టర్ సికిందర్ బాబా తదితర విభాగాల అధిపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైవపరీక్షలో తన పరిశోధనను విజయవంతంగా వివరించినట్లు తెలిపారు. పరీక్షకుల ప్యానెల్ సిఫార్సుల మేరకు సుధమల్ల మల్లేశ్‌ను డాక్టర్ ఆఫ్ ఫిలాసఫి పిహెచ్‌డీ.అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.


అనురాగ్ యూనివర్శిటీ విద్యార్థికి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగంలో చేసిన పరిశోధనకు మల్లేశ్‌ను డాక్టరేట్‌కు ఎంపిక చేసి సర్టిఫికేట్లు ప్రధానం చేస్తున్న కళాశాల పరీక్షల డీన్ ముత్తారెడ్డి తదితరులు.

## మొదటి గ్రామ సభలోనే వరాలు జల్లు

### సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి


గ్రామానికి ట్యాక్స్‌ల క్రింద ప్రజల తరుపున స్వంత డబ్బులతో చెక్ ఇస్తున్న సర్పంచ్ సునీత ప్రభాకరరెడ్డి

**తలకొండపల్లి ఫిబ్రవరి12,ప్రభాత వార్త:** రంగారెడ్డి జిల్లా, తలకొండ పల్లి మండలం పరిధిలోని పడకల్ గ్రామం లో గ్రామపంచాయతీ ఆవరణ లో మొదటి గ్రామ సభ సర్పంచ్ దోకురి సునీత ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గ్రామసభలో తీర్మానం చేసి గ్రామ ప్రజలకు 5సంవత్సరాలు ఇంటి ట్యాక్స్ ,నల్ల బిల్ గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి తన సొంత డబ్బులతో చెల్లిస్తామని తెలిపారు. గ్రామములోని ప్రజలందరికీ తమ పదవీ కాలం మొత్తం ఎలాంటి టాక్సీలు లేకుండ స్వంతంగా భరిస్తామని నన్ను నమ్మి గెలిపించినందుకు ప్రజలకు తాము శాయశక్తుల కృషిచేస్తామని ఆమె తెలిపారు.అనంతరం స్వంతంగా ఒక లక్ష యాభై వేలు రూపాయల చెక్కును మండల పంచాయతీరాజ్ అధికారి లక్పతి నాయక్, గ్రామపంచాయతీ సెక్రెటరీ మంద కుమార్‌కి అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ జినుకుంట్ల రాఘవేందర్.., వార్డు సభ్యులు జోగు విజయ్, జిల్లెల్ల సువాసిని, లట్టుపల్లి వసంత రంగారెడ్డి, అబ్దుల్ వాజిద్, బురిగళ్ళ రాధిక రమేష్, బండగాళ్ల చెందు, చెవిటి విమలమ్మ, జనిగే నర్సింహ, చెవిటి విజయ్, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## రాంపూర్‌లో మహిళా భవనానికి శంకుస్థాపన

**తలకొండపల్లి ఫిబ్రవరి12,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండలపరిధిలోని రాంపూర్ గ్రామానికి మహిళా సమాఖ్య భవనం మంజూరైంది.ఇట్టి భవనానికి గురువారం గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్,ఉప సర్పంచ్ సప్పిడి అంజనేయులు,సిసి వసంతలు నాయకులతో కలిసి ఈజీఎస్ నుండి రూ.10 లక్షలతో మంజూరు చేయబడిన మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధి ద్వారానే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ నూతన భవనం మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యకలాపాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు మోహన్ రెడ్డి,మణెమ్మ యాదయ్య, మాజీ ఎంపిటీసి కటికెల యాదయ్య,వార్డు సభ్యులు కాకి రామచంద్రయ్య,కటికెల మధుసూధన్ సప్పడి సునీతా,దొరబాయి లాలమ్మ,,తిక్కల జంగయ్య,మిద్దెల భార్గవి,సెక్రెటరీ రమేష్ నాయక్,మాజీ వార్డు సభ్యులు అంజనేయులు,విఏఎ మద్ది కృష్ణ రెడ్డి,నాయకులు చిన్న హరి మోహన్ రెడ్డి,అంజిరెడ్డి, రాం రెడ్డి,షర్పోద్దీన్ తదితరులు ఉన్నారు.



## నేడే మున్సిపల్ ఫలితాలు

- గెలుపుపై కాంగ్రెస్,బిఆర్ఎస్ అభ్యర్థులు ధీమా
-గట్టి పోటీనివ్వనున్న బిజెపి

**పరిగి ,ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** నేడే మున్సిపల్ ఎన్నికల ఫలితాల విడుదల నేపథ్యంలో పరిగి మున్సిపాలిటీలో పట్టు ఎవరిదనేది తీవ్ర ఉత్కంఠగా మారింది.ఫలితం ఎలా ఉండబోతుందోనన్న ఆందోళనలో అభ్యర్థులు తల పట్టుకుంటున్నారు. చైర్మన్ సీటుపై కాంగ్రెస్ ,బిఆర్ఎస్ బడా నాయకులు ధీమాగా ఉన్నా , నేడు వెలువడే ఫలితం పై ఆసక్తిగా వేచిచుస్తున్నారు..మూడు పార్టీల అభ్యర్థులు గెలుపుపై,ఓటింగ్ జరిగిన తీరుపై వారు లెక్కలేస్కుంటున్నారు. కొన్ని వార్డుల్లో ఓటర్లు ప్రలోభాలకు లొంగారా?లేదా ఎటువైపు ఓటు వేశారన్న ఆలోచనలో అభ్యర్థులు,కీలక నేతలు ఎక్సిట్ పోల్ పై కన్నేశారు.. 18వార్డులకు గాను 10వార్డులు గెలిస్తే చాలు అన్న ఆశతో పార్టీల నేతలు దేవుళ్లను వేడుకుంటున్నారనే చెప్పొచ్చు.

ఓటింగ్ సరళిని బట్టి పరిగి మున్సిపల్ పీఠం ఎవరికి దక్కుతుందో అంచనా కూడా వేయలేని పరిస్థితిలో మున్సిపల్ అభ్యర్థులతో పాటు మున్సిపల్ ప్రజలు,బడా నేతలు దీర్ఘాలోచనలో పడ్డారు. బ్యాలెట్ బాక్సుల్లో నిక్షి ప్తమైనా అభ్యర్థుల భవిష్యత్తు వెలువడే వేళ, అటు కాంగ్రెస్ ,బిఆర్ఎస్ బడానేతలతో పాటు బీజెపి కూడా వారి లెక్కలను వేసుకుంటుంది. మున్సిపల్ ఫలితాలు అటు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి, ఇటు మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డికి సవాల్ గా మారాయి. ఏదేమైనా నేడు ఉదయం 8 గంటల నుండి ప్రారంభం అవుతుండటంతో మద్యాహ్నం వరకు విడుదలయ్యే ఫలితాల్లో ఎవరికి అదృష్టం పట్టనుందో వేచి చూడాల్సిందే.

# సృజనాత్మకతను వెలికి తీయటానికే ఆక్టేవ్ -2026

### -విశ్వవిశ్వాని ఇనిస్ట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ డాక్టర్ జయశ్రీవెలుతక్కుల్ - రెండు రోజుల పాటు ఈవెంట్ ప్రదర్శన కార్యక్రమాలు


తూంకుంటలోని విశ్వవిశ్వాని కళాశాలలో జ్యోతి వెలిగించి లాంఛనంగా ఆక్టివ్-2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన విశ్వవిశ్వాని ఇనిస్ట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ డాక్టర్ జయశ్రీవెలుతక్కుల్, ఎసిపి వెంకట్‌రెడ్డి, పలువురు ప్రముఖుల దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను, నైపుణ్యాలను వెలికి తీయటానికి, వాటిని ప్రదర్శించటానికి ఆక్టేవ్-2026ను రెండు రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీటిని విద్యార్థులు దోహదం చేసుకోవాలని విశ్వవిశ్వాని ఇనిస్ట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ డాక్టర్ జయశ్రీవెలుతక్కుల్ అన్నారు. గురువారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని విశ్వవిశ్వాని కళాశాల క్యాంపస్‌లో విశ్వవిశ్వాని ఇన్స్టిస్ట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ వార్షిక ఇంటర్ కాలేజీ సాంస్కృతిక ఉత్సవంను రెండు రోజుల పాటు జరిగే ఆక్టేవ్ -2026 కార్యక్రమాన్ని నిర్వహించటానికి ఆమె జ్యోతి వెలిగించి లాంఛనంగ ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వవిశ్వాని ఇనిస్ట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ డాక్టర్ జయశ్రీవెలుతక్కుల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయటానికి ఆక్టేవ్ -2026కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఇన్నోవెట్, ఇంటిగ్రేట్ ఇన్‌స్పైర్ అనే థీమ్‌తో చుట్టు కేంద్రీకృతమైన ఆక్టేవ్-2026 విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలలతో నాయకత్వ లక్షణాలతో ప్రదర్శించటానికి ఐనమిక్ వేధికగా అందించటానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సాంస్కృతి, సాహిత్య ,సమగ్ర అభివృద్ధిని పెంపొందించటానికి ఈ ఫెస్ట్ రూపొందించబడిందన్నారు.

ఆక్టేవ్-2026 వివిధ సంస్థల్లోని విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే విస్తృత శ్రేణి పోటీలు, వారి ప్రదర్శనలు ఆకర్షణీయాంగా మారి కార్యకలాపాలు, అభ్యాసం టీంవర్క్ ఆరోగ్యకరమైన అంతర్ కళాశాలల పరస్పర చర్యలను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ ఉత్సవంలో అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ లర్నింగ్ అండ్ ఆర్గనైజేషన్ డవలప్‌మెంట్ హెడ్ ఎల్లరన్‌నాథన్, బ్యాంకు ఆఫ్ బరోడా డిజి, రీజనల్ హెడ్ సునీల్‌కుమార్, ఎసిపి వెంకట్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు. 13వ తేదీన కూడ ఈ కార్యక్రమం రెండవ రోజున కొనసాగుతుందన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ధారూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** అటవీ ప్రాంతం నుండి అక్రమంగా ఇసుక ు తరలిస్తున్న ఒక ట్రాక్టర్ ను ధారూర్ అటవీ శాఖ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ధారూర్ రేంజ్ పరిధిలోని ఏడు బ్రిడ్జి వద్ద అధికారులు గస్తీ నిర్వహిస్తుండగా, టిఎస్ 07 యు సి 6800 నంబర్ గల ట్రాక్టర్ ఇసుకతో పట్టుబడింది.

విచారణలో ఈ వాహనం పెద్దేముల్ మండలం మదనంతపూర్ గ్రామానికి చెందిన రాందాసుకు చెందినదిగా గుర్తించారు. ట్రాక్టర్ ను సీజ్‌చేసి కార్యాలయానికి తరలించామని, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో అటవీ శాఖ సిబ్బంది అఫ్రిది, ఉమర్ పాల్గొన్నారు.


ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

## ఆటో, మోటారు బైక్ ఢీ..పలువురికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో

**పెద్దేముల్, పిబ్రవరి 12, ప్రభాతవార్త:** ఆటో మోటారు మైకు ఢీ కొన్న సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుదవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐశంకర్ తెలిపిన వివరాల ప్రకారం...తాండూరు నుంచి పెద్దేముల్ వైపు పెళ్ళి సామానుతో వెళుతున్న ఆటోను పెద్దేముల్ మండలం కందనెల్లితాండా సమీపంలోనిసుద్ద కంపెని వద్ద మోటారు బైక్ ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో పాటు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గమనించి తాండూరులోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆటో కింద పడటంతో అందులో ఉన్న పెళ్ళి సామాన్లు, బట్టలు చెల్లా చెదురుగా పడటంతోవేరే ఆటోలో సామాన్లను తరలించారు. భాధితుడు లక్ష్మప్ప పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉదారతను చాటుకున్న పటేల్ రవిశంకర్

..ఆలయ సన్నిదిలో బోరు కోసం రూ.60 వేలు విరాళం
....సమాజసేవ కోసం పరితపించడం అభినందనీయం
...ఆలయ నిర్మాణ పొందర్ బిచ్చప్ప

**పెద్దేముల్, పిబ్రవరి 12, ప్రభాతవార్త:** శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిదిలో బోరు వేయించేందుకు పటేల్ రవిశంకర్ రూ. 60 వేలు విరాళం అందజేసి తనఉదారతను చాటుకున్నారు. రాజీవ్ కాలని (ఖాంజాపూర్ గుట్ట) సమీపంలో వెంకటేశ్వరస్వామి దేవా లయం దగ్గర తాండూరు పట్టణానికి చెందిన పటేల్ రవిశంకర్‌రూ. 60 వేల రూపాయిలతో బోరు వేయించారు. ఈ సందర్బంగా ఆలయ నిర్మాణ పొందర్ బిచ్చప్ప మాట్లాడుతూ స్వామి వారి సన్నిధిలో బోరు వేయించాలని

అడిగిన వెంటనే పటేల్ రవిశంకర్ తన పెద్దమనసుతో ఒప్పుకొని బోరు వేయించారని అన్నారు.సమాజ సేవ కోసం పటేల్ రవిశంకర్ పరితపించడం అభినందనీయమని అన్నారు. స్వామి వారి ఆశీస్సులు పటేల్ రవిశంకర్‌పై ఉండాలని ఆకాంక్షించారు. పటేల్ రవిశంకర్‌ను ఆదర్శంగా తీసుకొని ఆలయ అభివృద్ధికి మరి కొందరుదాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


బోరు వేస్తున్న దృశ్యం

## సాంస్కృతిక ఉద్యమాల ధార నందిని సిధారెడ్డి సాహిత్యం


కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీం, సంపత్‌కుమార్, నర్సింహ్మారెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** తెలంగాణ సాంస్కృతిక ఉద్యమానికి ప్రాంతీయ అస్తిత్వాన్ని జోడించిన కవి నందిని సిధారెడ్డి అని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అన్నారు. జిహెచ్‌ఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, మహేంద్రాహిల్స్‌లో గురువారం 'డాక్టర్ నందిని సిధారెడ్డి సాహితి సమాలోచన' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు బాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈసదస్సు ఏర్పాటు చేశారు. ఈసదస్సుకు మహేంద్రహిల్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్నేహలత అధ్యక్షతన వహించగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తాను సాంఘిక సంక్షేమ పాఠశాలలో చదివి ఈరోజు ఈస్థాయిలో నిలబడడానికి కారణం గురుకులం అన్నారు. తెలంగాణ సాంస్కృతి ఉద్యమానికి ప్రాంతీయ అస్తిత్వాన్ని జోడించిన కవి సిధారెడ్డి అని ఆయన కొనియాడారు. ఈసందర్భంగా పత్ర సమర్పకులు నందిని సిధారెడ్డి సాహిత్యంపై వివిధ కోణాలలో మాట్లాడారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నుంచి డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ సిధారెడ్డి సాహిత్యం నేటి తరానికి అవసరమన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలంగాణ బాషా సాంస్కృతిశాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ సిధారెడ్డి కవిత్వం, వ్యక్తిత్వం ఒకటే అని వారి నిబద్ధతకు నిదర్శనమన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి మాట్లాడుతూ విద్యార్థులు సిధారడ్డి సాహిత్యాన్ని చదవాలని సూచించారు. సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా 120 పుస్తకాలను ఆవిష్కరించారని తెలిపారు. తెలుగు బాషా చైతన్య సమితి అధ్యక్షులు పి.బడేసాబ్ మాట్లాడుతూ తెలుగు బాషా చైతన్య సమితి పుష్కర కాలంగా సాహితీ కృషిని తెలియజేశారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేధిక రాపోలు సీతారామరాజు ఆన్‌లైన్‌లో 'ప్రాణహిత కవితా సంపుటి'పై వివరించారు. యూకే నుంచి చాడ సృజన్‌రెడ్డి ఆన్‌లైన్‌లో సందేశం ఇస్తూ తెలంగాణ బాష, కట్టు, బొట్టు, అస్తిత్వం సిధారెడ్డి సాహిత్యంలో ఉందన్నారు. డాక్టర్ కోయి కోటేశ్వరరావు కీలక ఉపన్యాసం చేశారు. సిధారెడ్డి మహికవి, పుష్పక విమానం లాంటి వాదని వీరి సాహిత్యంలో చెమట, రక్తం, కన్నీరు ఉంటాయని పేర్కొన్నారు.

ఓయూ ఆంగ్ల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొండా నాగేశ్వరరావు మాట్లాడుతూ నందిని సిధారెడ్డి సాహిత్యం, ఆంగ్లసాహిత్యం, గ్లోబలైజేషన్‌గా తులనాత్మక అధ్యయనంపై పిపిటితో వివరించారు. నందిని సిధారెడ్డి సాహిత్యానికి నోబెల్ బహుమతి రాదగిందని అన్నారు. సదస్సు సంచాలకులు మహేంద్రాహిల్స్ గురుకుల కళాశాల తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్ శ్రీబాష్యం అనురాధ సదస్సు లక్ష్యాన్ని వివరిస్తూ నేటితరం విద్యార్థులకు సిధారెడ్డి సాహిత్యం తెలుసుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. సదస్సుకు డిగ్రీ కళాశాలల డిసిఓ డాక్టర్ సునీత, తెలుగుబాష చైతన్య సమితి సంపాదకులు డాక్టర్ జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కల్లేశ్, కార్యదర్శి ఎల్.జగన్‌లు సహకారం అందించారు. కళాశాల అధ్యాపక బృందం, పత్ర సమర్పకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిధులను సద్వినియోగం చేసుకోవాలి

### ఎంపిడిఓ సోమలింగం

**చౌడపూర్ , ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** గ్రామ పంచాయితీల అభివృద్దిలో భాగంగా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని మండల ఎంపిడిఓ సోమలింగం అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్కపూర్ గ్రామంనందు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పది లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న మహిళా సమైక్య భవననిర్మాణానికి సర్పంచ్ లావణ్యారామంజనేయులు, ఎంపిడిఓ సోమలింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్‌లు కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇ శివ గౌడ్, ఉప సర్పంచ్ గోపాల్ నాయక్, పరిగి ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజేందర్ రెడ్డి,ఎంపిఓ రాజిరెడ్డి, సిసి శ్రీనివాస్, మహిళా సంఘం అధ్యక్షురాలు చంద్రకళ, గ్రామ సెక్రెటరీ రేణుక , నాయకులు పాల్గొన్నారు.


పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న నూతన సర్పంచులు అధికారులు

## అధికారులతో నూతన సర్పంచ్‌ల సమావేశం

**యాచారం,ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** నూతనంగా ఎంపికైన సర్పంచులు గ్రామ ప్రథమపౌరునిగా మార్గదర్శిక సర్పంచ్ పీఠాన్ని ఆధిరోహించాలని యాచారం ఎంపిడిఓ రాధా రాణి పేర్కొన్నారు. గురువారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రాధా రాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ప్రత్యేకాధికారి మాధవరావు,తహసిల్దార్ అయ్యప్ప, సిఐ నందీశ్వర్‌రెడ్డి హాజరైనారు. ఎంపి ఓ శ్రీలత, సూపరిండెంట్ శైలజ,నూతన సర్పంచులు వివిధ శాఖల అధికారులతో కలిసి పరిచయకార్యక్రమం ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులను ఉద్దేశించి ఎంపిడిఓ మాట్లాడుతూ.. సర్పంచుల అధికారాలు బాధ్యతలను వివరించారు. సర్పంచ్ అంటే కేవలం పెత్తనం చెలాయించడం కాదని గురుతర బాధ్యత అన్నారు.గ్రామ బాగోగులను చూడడం సర్పంచ్‌తోపాటు ఉప సర్పంచ్ వార్డు సభ్యులతో కలిసి కీలక పాత్ర ఉంటుందని పంచాయతీరాజ్ చట్టం స్పష్టం చేస్తుందని పేర్కొన్నారు. గ్రామసభ సమావేశాలకు అధ్యక్షత వహించి ప్రతి రెండు నెలలకు ఒకసారి పాలక వర్గంతో తప్పనిసరిగా సమావేశం నిర్వహించాలని సూచన చేశారు.ముఖ్యంగా మహిళలు వృద్ధులు అనగా ఆయ వర్గాల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా చర్చించి తీర్మానం చేయాలని తెలిపారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చేనిధులను పాలకవర్గం తీర్మానాల ప్రకారమే గ్రామ అభివృద్ధికి వినియోగించాలన్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ద్వారా ఉపసర్పంచ్లకు కూడా కీలక అధికారులను కట్టబెట్టిందన్నారు. సర్పంచ్ అందుబాటులో లేనప్పుడు ఉప సర్పంచ్ అధ్యక్షతన సభలు ఏర్పాటు చేయవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో నూతన సర్పంచులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత

**కేశంపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని దేవుని గుడి తండా గ్రామానికి చెందిన కేతావ దేశ్య గురువారం తెల్లవారు జామున ఆకస్మికంగా మృతి చెందాడు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 5వేలను గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. వారితో పాటు గ్రామ సర్పంచ్ సుజాత హనుమంత్ 3000 వేల రూపాయలు, మాజీ డిప్యూటీ సర్పంచ్ వాడుకవత్ కిషన్ నాయక్ 2000 వేల రూపాయలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తండావాసులు తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

## శ్రీమహదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు

### శివస్వాములకు పండ్లు,పాలు పంపిణీ


ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శివస్వాములు

**కొడంగల్,ఫిబ్రవరి 12 , ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీమహదేవుని ఆలయంలో గురువారం శివస్వాముల అధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈనెల 2వ తేది నుండి 12వ తేది వరకు శివస్వాములకు శ్రీమహదేవుని ఆలయ భజనమండలి అధ్వర్యంలో దాతల సహకారంతో పాలు,పండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్బంగా గురుస్వాములు గడ్డం చంద్రశేఖర్ అధ్వర్యంలో శివస్వాములు శివలింగానికి పంచామృతా భిషేకం,శివాష్టకం ,లింగాష్టకం,శివాష్టత్తర శత నామావళిలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు.స్వామివారికి నైవేద్యం సమర్పిస్తూ మంగళహారతులు అందిస్తు స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం శివస్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు.

